# అమృత్ భారత్‌లో పాల్గొనడం సంతోషం

- రూ.41 వేల కోట్లతో రైల్వే స్టేషన్ల అభివృద్ధి ప్రధాని మోదీ సాహస నిర్ణయం
- మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి
- ఎక్స్‌ప్రెస్ రైళ్లు మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో ఆపాలని వినతి




అమృత్ భారత్ పథకం కింద చేపట్టే పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: దేశంలో 41వేల కోట్లతో రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు అమృత్ భారత్ కింద ఎంపిక చేసి వాటికి ఏకకాలంలో శంకుస్థాపన చేయడం ప్రధాని నరేంద్ర మోదీ సాహస నిర్ణయమని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ప్రధాని మోదీ వర్చువల్‌గా మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన అమృత్ భారత్ పనుల శంకుస్థాపన చేయగా ఆ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో పాల్గొని ప్రసంగించారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఇలాంటివి చారిత్రాత్మక నిర్ణయాలని అన్నారు. ఒకప్పుడు రైల్వే స్టేషన్ అపరిశుభ్రంగా, మూత్రశాలలు అస్తవ్యస్తంగా ఉండేవని అన్నారు. అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం అభినందనీయం అన్నారు. అందులో భాగంగా మేడ్చల్‌ను ఎంపిక చేసి ఆధునీకరించేందుకు శంకుస్థాపన చేయడం బాగుందన్నారు. మేడ్చల్ రైల్వే లేన్‌ను అభివృద్ధి చేస్తున్నందుకు ప్రధాని మోదీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**అండర్ పాస్‌లను త్వరగా పూర్తిచేయాలి..**

మేడ్చల్ రైల్వే రూట్లో మేడ్చల్, గుండ్లపోచంపల్లి, గౌడవెల్లిలో అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారని మేడ్చల్‌లో, గుండ్లపోచంపల్లి పనులు నత్తనడకగా సాగుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పనులను త్వరగా పూర్తి చేయించాలని ఎమ్మెల్యే రైల్వే అధికారులను కోరారు.

**ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేలా..**

మేడ్చల్ మీదుగా ఉత్తర భారత్‌కు వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో నిలిపేలా చూడాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి రైల్వే అధికారులను కోరారు. నగరశివార్లలో ఉన్న మేడ్చల్ ఎంతో అభివృద్ధి చెందుతోందని, ప్రజల అవసరాలకు తగ్గట్టు మేడ్చల్‌లో రైళ్లు నిలపాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, రైల్వే ఏడీఆర్‌ఎం కోటేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రంగనాథ్, మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## జెడ్పీ పాఠశాలలో ప్రతిభ పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ శశిధర్, హెచ్‌ఎం పాపిరెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయి ప్రతిభ పోటీలు సోమవారం నిర్వహించారు. విద్యార్థులు చదవడం, పద్య పఠనం, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రం అందజేశారు. పోటీల్లో కాంప్లెక్స్ పరిధిలోని 10 పాఠశాలల నుంచి 80 విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంఈఓ శశిధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపిరెడ్డి, విజయ్, రవీందర్‌రాజు, మదన్‌మోహన్, రాంనాథ్‌రెడ్డి, ఆంజనేయులు నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శిగా యాహియా



ఘట్‌కేసర్: యూత్ కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శిగా యాహియా, ఉపాధ్యక్షులుగా సుభాష్ ముదిరాజ్, రఫీయుద్దీన్ నియమితులయ్యారు. యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఎంపిక చేయగా నియోజకవర్గ అధ్యక్షుడు సుకాంత్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్‌తో కలిసి వారికి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేశ్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

## టెక్, ఫార్మా సంప్రతి పోస్టర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్: చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి (ఎన్ఎస్ఆర్) కళాశాలలో టెక్, ఫార్మా సంప్రతి పోస్టర్‌ను ఆ కళాశాల కార్యదర్శి సీవీ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ నల్లా ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. వచ్చేనెల 21, 22, 23న తేదీల్లో విద్యార్థులు ఈవెంట్లను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టర్ పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ఫార్మా క్విజ్‌తో పాటు పలు రకాల పోటీలు నిర్వహిస్తామని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్‌లు, పలు విభాగాల అధిపతులు, టీపీఓ పాల్గొన్నారు.

## రామలింగేశ్వరాలయంలో భజన



మేడ్చల్: పట్టణంలోని రామలింగేశ్వర ఆలయ ఆవరణలో శివస్వాములు శివ మహాపడి పూజ చేయడంతో శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి శివపూజలో పాల్గొని భజనలు చేశారు. శివమాలలు వేసుకున్న స్వాములు ద్వాదశ జ్యోతిర్లింగాల పూజలను వైభవంగా నిర్వహించారు. భజనలు, అభిషేకాలు, అన్నదానం నిర్వహించారు. పూజల్లో శివస్వాములు, భక్తులతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు కౌడె మహేష్, హరికృష్ణయాదవ్, శివకుమార్, దేవ, రవీందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి గురుస్వాములు జనార్దన్, తోట రాజు, వీరేష్ పటేల్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామివారి కల్యాణ మహోత్సవం



కీసరలో మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవంలో గ్రామస్తులు



భోగారంలో చిత్తారమ్మ జాతర పూజల్లో భక్తులు

కీసర: మండల కేంద్రమైన కీసరలో సోమవారం శ్రీభమరాంబకేతమ్మ సమేత మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కీసర గ్రామానికి చెందిన యాదవ కులస్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భోగారంలో ఘనంగా

**భోగారం గ్రామంలో చిత్తామర్మ జాతర..**

భోగారం గ్రామంలో శ్రీచిత్తారమ్మ దేవాలయ జాతర మహోత్సవాన్ని సోమవారం గ్రామస్తులు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దేవాలయంలో కొలువైన అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## నాగారంలో ప్రభుత్వ స్థలాలను కాపాడండి

కీసర: నాగారం మున్సిపాలిటిలోని కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలను కొందరు వ్యక్తులు కబ్జాలకు పాల్పడుతున్నారని, సదరు స్థలాలను కాపాడాలని కోరుతూ సోమవారం నాగారం మున్సిపాలిటీకి చెందిన పలువురు జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నాగారంలోని సర్వే నంబర్ 291, 354, 370లో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలం ఉందని, ఇటీవల కాలంలో కొందరకు రియల్టర్లు, అక్రమార్కులు పక్క నంబర్లు వేసి అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమంగా 59 జీవోల పేర్లతో ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ప్రభుత్వ స్థలాలను సర్వే చేసి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

## కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు మూడు నెలలుగా వేతనాలు అందకపోయినా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా సీఐటీయూ కోశాధికారి ఉన్ని కృష్ణ విమర్శించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్లకు ఆరు నెలలుగా అద్దెలు కూడా చెల్లించడం లేదన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల ఇబ్బందులను సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. గతంలో ప్రభుత్వం ఒప్పుకున్న అంగన్‌వాడీల డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. ధర్నాలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.సునీత, ఉపాధ్యక్షురాలు పి.శివరాణి, కోశాధికారి బాలమణి, జిల్లా నాయకురాలు అంజమ్మ, రేణుక, అనిత, సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సీఐటీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రజావాణికి 120 ఫిర్యాదులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజలు అందించే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి కలెక్టరేట్ విభాగం సీ, డీ సెక్షన్ల అధికారులు గీత, భూపాల్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా 120 అర్జీలను తీసుకున్నారు. ఇందులో భూవివాదాలు, ధరణి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, అక్రమ కట్టడాలు, భూకబ్జాలు తదితర వాటికి సంబంధించిన ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

**మున్సిపల్ చైర్ పర్సన్ పర్సన్ పావనీజంగయ్య**



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మెరుగైన సదుపాయాలు, పారదర్శక పాలన అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అధికారులు సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన, కమిషనర్ సాబేర్ అలీ ఆధ్వర్యంలో సోమవారం అంచనా బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల అంచనా బడ్జెట్ ఆదాయ, వ్యయాలతో పాటు పలు అంశాలపై చర్చించారు. 2024–25 బడ్జెట్ అంచనా ప్రవేశపెట్టగా ఆదాయం రూ.16 కోట్ల 88 లక్షల 29 వేలు, అంచనా వ్యయం రూ.16 కోట్ల 47 లక్షల 99 వేల బడ్జెట్‌ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలకు అవసరమైన తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరించాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, సంగీత, ఆంజనేయులుగౌడ్, హేమలత, శశికళ, మల్లేశ్, వసంత, నరేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, రవీందర్, కోఆప్షన్ సభ్యులు, అరుణ, షౌకత్, ఏఈ నరేశ్, మేనేజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## 20 రోజులుగా తహసిల్ మీటింగ్ హాల్‌కు పవర్ కట్



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని కాప్రా మండల తహసిల్ ఆఫీస్ మీటింగ్ హాలుకు గత 20 రోజులుగా విద్యుత్ సరఫరా లేదు. దీనిపై అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయం విద్యుత్ అధికారులను వివరణ కోరగా.. ఆరు నెలల నుంచి విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో కరెంట్ కట్ చేశామని, రెవెన్యూ అధికారులు బిల్లు కడితే విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి ప్రతిష్ఠ మహోత్సవాలు



పూజా కార్యక్రమాల్లో నవీన్‌మిట్టల్, ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తదితరులు



చీర్యాల లక్ష్మీనృసింహస్వామి ఆలయం పూజల్లో మంత్రి శ్రీధర్‌బాబు

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రీగంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామివారి ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, త్రిశూల పూజ తదితర కార్యక్రమాల్లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, రాష్ట్ర ల్యాండ్, రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ పాల్గొన్నారు. పూజల అనంతరం ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, నవీన్‌మిట్టల్ దంపతులకు స్వామివారి ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, వజ్రేశ్ యాదవ్, కోల కృష్ణ యాదవ్, రామిడి విజయ్‌రెడ్డి, మధుయాదవ్, రామిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పసుపులేటి వీరభాస్కర్‌రావు, గౌరవ అధ్యక్షులుగా కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదిర్శిగా ఆవుచర్ల నాగభూషణం, కోశాధికారిగా పోరెడ్డి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కనకయ్య, నర్సింహులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గవర సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా మహేంద్రబాబులను ఎన్నుకున్నారు.

## సీఐకి సన్మానం



మేడ్చల్: మేడ్చల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, మేడ్చల్ కౌన్సిలర్ ఉమానాగరాజు వేర్వేరుగా కలిసి సన్మానించారు. నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐని ఘనంగా సన్మానించి మేడ్చల్‌కు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, రాజశేఖర్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## తైబజార్ దక్కించుకున్న వినోద్

ఘట్‌కేసర్: చౌదరిగూడ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆ పంచాయతీ ప్రత్యేక అధికారి సాంబశివరావు, ఎంపీఓ నందకిశోర్ ఆధ్వర్యంలో తెలంగాణ నూతన పంచాయత్ రాజ్ చట్టం అనుసరించి సోమవారం తైబజార్ బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో ఆ గ్రామానికి చెందిన కేశపావుల వినోద్ రూ.1 లక్ష 32 వేలకు తైబజార్‌ను దక్కించుకున్నాడు. ఎంపీటీసీలు రామారావుముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శశికుమార్, నాయకులు భోజిరెడ్డి, స్వామిదాస్, శేఖర్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, నర్సింగ్‌ముదిరాజ్, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులకు చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్ధార్థ నగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు చెప్పారు. 17వ వార్డులో రూ.20 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డుతో పాటు భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, కౌన్సిలర్లు ముప్ప శ్రీలత, మోర మౌనిక, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం



జవహర్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా జమ్మిగడ్డ సాకేత్ ప్రణామ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(30) గుర్తుతెలియని రసాయనం తాగి పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడి వివరాలు తెలిస్తే.. ఫోన్: 87126 62188, 87126 62097.

# జీతమొస్తేనే సాగే.. జీవితం..

- ఎనిమిది నెలలుగా అర్ధాకలితో పంచాయతీ కార్మికులు
- జీతాలందక పస్తులుంటున్న కార్మికుల కుటుంబాలు
- పూటగడవడం కూడా కష్టమవుతోందని ఆవేదన
- మిత్తికి తెచ్చుకొని బతుకుతున్నామంటూ వేడుకోలు
- ప్రతినెలా చెల్లించాల్సిన వేతనాలు రూ.4.06 కోట్లు
- 4.779 మంది కార్మికులకు వేతనాలు రాక ఇబ్బందులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రతిరోజూ వారు పనిలోకి వస్తేనే పల్లెలు పరిశుభ్రంగా ఉంటాయి. వారు ఒక్కరోజు పనిచేయకపోయినా గ్రామాల్లోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత రహదారులూ చెత్తా చెదారంతో నిండిపోతాయి. ఇంటి ముందు చెత్త అలాగే ఉందని విసుక్కుంటాం, ముక్కు మూసుకుంటాం.. తెల్లవారుజామునే వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతోనే దినచర్య మొదలయ్యే పేద కార్మికులు వారు. ఆ పారిశుద్ధ్య కార్మికులకు 8 నెలలుగా వేతనం అందక ఇబ్బందులు పడుతున్నారు. లింగాపూర్ తండా పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 8 నెలలుగా జీతాలు రాకపోగా, పూడూరు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు 4 నెలల నుంచి, కోల్తూర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 3 నెలల నుంచి జీతాలు అందడం లేదు.

**కుటుంబ పోషణ భారమై..**

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 61 గ్రామ పంచాయతీలు ఉండగా, వీరందరికీ గరిష్టంగా ఎనిమిది నెలల నుంచి మూడు నెలలుగా వేతనాలు అందక వారి కుటుంబాలు అర్ధాకలితో జీవితాన్ని నెట్టుకొస్తున్నాయి. దీంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీధులను శుభ్రపరిచే కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం శోచనీయం.

**వేదన ఇంతా అంతా కాదు..**

నూతన పంచాయతీ చట్టం ప్రకారం వీరందరినీ మల్టీపర్పస్ వర్కర్స్‌గా పిలుస్తున్నారు. ఈ కార్మికులకు సంబంధించిన వేతనాలు నెలనెలా వారి ఖాతాల్లో జమ అవుతుంటాయి. గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులను బట్టి 8 నెలల నుంచి 3 నెలలుగా వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ కాకపోవడం గమనార్హం. జీతాలు అందక వారు పడుతున్న వేదన ఇంతా అంతా కాదు. నగర శివారు మేడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 619 గ్రామ పంచాయతీల్లో 4,779 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలకు రూ.8.500 చొప్పున రూ.4.06 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 4,002 మంది కార్మికులు పని చేస్తున్నారు. అలాగే, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 777 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. పారిశుద్ధ్యం, ట్రాక్టర్ డ్రైవర్లు, పన్నుల వసూళ్లు, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు.

**త్వరలో వేతనాలు..**

పంచాయతీ కార్మికుల వేతనాల అందకపోవడంతో ఇబ్బందిగా ఉందని సంబంధిత శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారాన్ని చేపట్టడంతోపాటు ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. త్వరలో వేతనాలు అందగలవని భావిస్తున్నారు.

## 8 నెలల జీతాలు వెంటనే చెల్లించాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: కొత్తగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం కూడా గ్రామ పంచాయితీ కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి కార్మికుల జీతాలు ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో అర్ధాకలికతో జీవితాన్ని నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు వెంటనే చెల్లించాలని నినాదాలు చేస్తూ మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు రెండు గంటలకు పైగా ధర్నా చేయగా పోలీసులు రంగప్రవేశం చేసి శాంతింపజేశారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ హరిప్రియకు యూనియన్ రాష్ట్ర, జిల్లా నేతలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, నాయకులు కృష్ణ, శ్రీనివాస్, సుగుణ, రవి, నరసింహ, శ్రీకాంత్‌తో పాటు గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమ పట్టాదారు పాసుపుస్తకాలను రద్దు చేయాలి

మేడ్చల్‌రూరల్: ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారి పాసు పుస్తకాలు రద్దు చేయాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని మండలంలోని గౌడవెల్లికి చెందిన బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి సోమవారం ప్రజావాణిలో మేడ్చల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గౌడవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 526లో 15.12 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ స్థలం ఉండగా కొందరు వ్యక్తులు, రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కై ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చి పట్టాదారు పాసుపుస్తకాలు పొందగా మరికొందరు చట్టవ్యతిరేకంగా విక్రయ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారి పాసుపుస్తకాలు రద్దు చేయాలని, అక్రమ నిర్మాణాలు తొలగించి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ రికార్డుల్లో తిరిగి ప్రభుత్వ స్థలంగా నమోదు చేయాలని కోరారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత



సంపత్‌ముదిరాజ్ (ఫైల్)

శామీర్‌పేట్: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మేడ్చల్ మండలం రాజబొల్లారం గ్రామానికి చెందిన సంపత్‌ముదిరాజ్, తన స్నేహితుడితో కలిసి ఆదివారం సాయంత్రం శామీర్‌పేట పెద్దచెరువు వద్దకు చేపలు పట్టడానికి చేరుకున్నారు. ఈ క్రమంలో సంపత్‌ముదిరాజ్ ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు సోమవారం చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## న్యాయం చేయాలంటూ వినతి



మేడ్చల్: 40ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న తమకు న్యాయం చేయాలని చెక్‌పోస్ట్‌లోని గుడిసెల వాసులు తహసీల్దార్ శైలజకు వినతి పత్రం అందజేశారు. చెక్‌పోస్ట్‌లోని సర్వే నంబర్ 844/6 తాము 40 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నామని, ఇటీవల కొంతమంది భూమి తమదంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విజయ్ అనే వ్యక్తి తమను బెదిరిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. న్యాయం చేసి పట్టాలు ఇప్పించాలని గుడిసెల్లో నివాసం ఉంటున్న లంబాడీలు కోరారు.

## శ్రీశైలంకు శివస్వాముల మహాపాదయాత్ర

మేడ్చల్: శివమహాదీక్ష తీసుకుని ఇరుముడిలతో మేడ్చల్‌కు చెందిన శివస్వాములు ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీశైలంకు మేడ్చల్ నుంచి పాదయాత్రగా తరలివెళ్లారు. మేడ్చల్ రామలింగేశ్వర ఆలయంలో ఇరుముడు కట్టుకుని శ్రీశైలంకు కాలినడకన తరలివెళ్లారు. శివస్వాములకు ప్రత్యేక పూజలు చేసి గురుస్వాములు తోట రాజు, శ్రీనివాస్‌గౌడ్, కొడే మహేష్ సాగనంపారు.

